ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.4
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 24 అక్టోబరు 2024



రాత్రి 8 గంటలకు తాళం వేసి ఉన్న చిట్యాలలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

న్యూస్ బాక్స్

శాస్త్రోక్తంగా నిత్యపూజలు



లక్ష్మీనృసింహుడికి నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకు లు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్ర నామార్చనలు చేశారు. గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 24,55,082 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి నృసింహుడిని దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేకంగా అధిక సంఖ్యలో వ్రత పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పథకాలు బాగున్నాయా..

ప్రజలను అడిగి తెలుసుకున్న సివిల్ సర్వీస్ అధికారులు



పెండ్లిపాకల గ్రామపంచాయతీ పరిసరాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ల బృందం

కొండమల్లేపల్లి, చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు బాగున్నాయా... మీకు అందుతున్నాయా అని సివిల్ సర్వీస్ ప్రొబేషనరి అధికారుల బృందం ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆల్ఇండియా సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం శిక్షణలో భాగంగా బుధవారం కొండమల్లేపల్లి, చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సంఘ బంధం గ్రూపులతో, గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాల వివరాలు తెలుసుకున్నారు. చింతపల్లి మండలంలోని జర్పులతండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం గ్రామంలో పర్యటించారు. ఢిల్లీ నుంచి మారుమూల మండలానికి పర్యటనకు వచ్చిన అధికారులను ఎంపీడీవో అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అధికారులు డి.కూడియారను, దిగ్విజయ్‌సింగ్, నివేదన్, పౌర్ణిమ సుడెన్, పాయల్ మీనా, రష్మి, అభిషేక్ రంజన్, కునాల్‌గురురాని, అషుతోష్‌సాటితో పాటు జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, సుగుణ, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యాపేటకు గవర్నర్ రాక

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



6

ఎల్లలు దాటినా సొంతూరిపై .. మమకారం

ఎన్నారైలు దుర్గాప్రసాద్, లక్ష్మయ్య, తిరుమల్‌రెడ్డి



6

బుద్ధగయ పర్యాటకులను బుద్ధవనానికి తీసుకురండి

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



6

ఆంధ్రజ్యోతి విజిట్

ఆపదొస్తే అంతే సంగతి!



▸▸ 24 గంటల ఆసుపత్రుల్లో రాత్రివేళ వైద్యులేరీ? ▸▸ స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎమ్‌లే దిక్కు

అత్యవసర సమయాల్లో రోగులకు, ప్రమాదబాధితులకు సేవలందించాల్సిన 24గంటల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రులు నామమాత్రంగా మిగిలాయి. చికిత్స నిమిత్తం రాత్రివేళ వస్తున్న రోగులకు నర్సులు, ఇతర సిబ్బంది సమీపంలోని ఏరియా ఆసుపత్రులకు, జిల్లా కేంద్ర ఆసుపత్రులకు పంపిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి బృందం,నల్లగొండ)

నల్లగొండ జిల్లాలో 24గంటల వైద్యసేవలు అందించే 18 ఆసుపత్రులను మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించింది. 18 పీహెచ్‌సీలకు గాను ఒక్కటంటే ఒక్క చోట కూడా వైద్యులు అందుబాటులో లేరు. స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు వారికి తోడుగా వాచ్‌మెన్ మాత్రం ఆసుపత్రుల వద్ద రాత్రివేళ అందుబాటులో ఉన్నారు. ఆ సమయంలో ఎవరైనా రోగులు, లేక క్షతగాత్రులొస్తే ప్రాథమిక చికిత్స అందించి, సమీప ఏరియా ఆసుపత్రికి, లేదంటే, జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపిస్తామని వారు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వైద్యులకు ఫోన్ చేస్తామని వారి సూచనల మేరకు రోగులకు వైద్యం, మందులు అందిస్తామని వెల్లడించారు. 24 గంటల వైద్యసేవలందించే ఆసుపత్రులకు ఇద్దరేసి డాక్టర్లున్న చోట కూడా రాత్రివేళ మాత్రం డ్యూటీకి రావడం లేదు. కలెక్టర్, వైద్యసేవల మెరుగుకై చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆసుపత్రుల నిర్వహణలో మార్పు రాకపోవడంతో పేద రోగులకు వైద్యం అందని దుస్థితి కొనసాగుతోంది. జిల్లాలో 24 గంటల ఆసుపత్రుల్లో రాత్రివేళ వైద్యసేవలు అందకపోవడం, కొన్ని ఆసుపత్రుల్లో సదుపాయాలు, సిబ్బంది, ఔషధాల కొరత వంటి సమస్యలకు కారణాలు తెలుసుకునేందుకు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్లా శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా, అందుబాటులోకి రాలేదు.



- నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్లు లేని కారణంగా అరకొరగా వైద్య సేవలు అందుతున్నాయి. ఇద్దరు వైద్యులు ఇటీవల బదిలీకాగా, మిర్యాలగూడ మండలం ఆలగడప వైద్యుడిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో రాత్రి వేళలో మేల్ ఎంపీహెచ్‌వోతో సేవలందిస్తున్నారు.
- వేములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేక ప్రజలకు అరకొరగా వైద్య సేవలు అందుతున్నాయి. నార్కట్‌పల్లి- అద్దంకి ప్రధాన రహదారిపై ఉన్న ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులకు ఒక్కరు ఉదయం వేళ వైద్యసేవలందిస్తున్నారు. మరొక వైద్యాధికారి డిప్యూటేషన్‌పై వేరొక చోటుకు వెళ్లడంతో రాత్రి వేళ కేవలం స్టాఫ్ నర్సు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. రాత్రి వేళా ఎమర్జెన్సీ కేసులు వచ్చినట్లయితే సమీపంలోని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి 108 దాబ్వారా తరలిస్తున్నారు.
- జాతీయ రహదారిపై ఉన్న చిట్యాల పీహెచ్‌సీ ఆసుపత్రి వైద్యులు సాయంత్రం ఐదు గంటలకే ఇంటి బాట పడుతున్నారు. మంగళవారం రాత్రి 8.30కు ఓ వ్యక్తి టీజీ ఇంజక్షన్ చేయించుకునేందుకు వచ్చి ఆసుపత్రికి తాళం వేసి ఉండడంతో వెనుదిరిగాడు. ఇద్దరు వైద్యులు ఎఎన్ఎంలు ఉన్నప్పటికీ రాత్రి పూట కేవలం వాచ్‌మెన్ మాత్రమే ఉంటున్నాడు. పారసిటమల్ మాత్రలు, టీటీ ఇంజక్షన్ సైతం అందుబాటులో ఉండటం లేదని రోగులు చెబుతున్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే నార్కట్‌పల్లి కామినేనికి, నల్లగొండ, హైదరాబాద్ తరలిస్తారు కానీ చిట్యాల ఆసుపత్రికి ఎవరూ రారు.
- శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఉదయం వేళలోనే ఉంటున్నారు. రోజూ 100లోపు అవుట్ పేషంట్స్ వస్తుంటారు. రాత్రి పూట స్టాఫ్స్ నర్సులు మాత్రమే డ్యూటీలో ఉంటున్నారు. సిబ్బంది మాత్రం సమయనుకూలంగా రావడం లేదని విమర్శలు వస్తున్నాయి. రెండు నెలల నుంచి ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. మునుగోడు పీహెచ్‌సీలో 24గంటల వైద్య సేవలు కొరవడ్డాయి. రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది మాత్రమే విధుల్లో ఉంటున్నారు. అత్యవసరంగా వచ్చిన రోగులకు ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు పంపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.
- చందంపేట మండల ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రంలో 8 నెలలుగా స్టాఫ్ నర్సులేకపోవటంతో ఫీల్డ్ స్టాఫ్‌తో ఓపీ విధులను చేయిస్తున్నారు. రెగ్యూలర్ స్టాఫ్ నర్సు, ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్‌నర్సు ఇద్దరు, రెగ్యూలర్ ఏఎన్ఎం 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలోని పొగిళ్ల, కంభాలపల్లి, చిత్రియాల, తెల్‌దేవరపల్లి, రేకులగడ్డ ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందాలంటే దేవరకొండకు వెళ్లాల్సిఉంది.
- డిండి ప్రాథమిక వైద్యశాలలో ఒక్కరే వైద్యుడు ఉండడంతో రాత్రివేళలో వైద్యసేవలు అందడంలేదు. జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఇతర..

- మిగతా 8వ పేజీలో...



టెన్షన్ టెన్షన్

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై రామన్నపేటలో బుధవారం జరిగిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఆందోళనలు, నిరసనల మధ్య ముగిసింది. రామన్నపేట సమీపంలో 63.8ఎకరాల్లో సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు అంబుజా కంపెనీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.

- (ఆంధ్రజ్యోతి,రామన్నపేట)



▸▸ ఉద్రిక్తత నడుమ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయ సేకరణ ▸▸ అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు
▸▸ సబ్ కోర్టు నిర్మాణం చేసే వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ చేపట్టొద్దు
▸▸ వేదిక ముందు అఖిలపక్షాల ధర్నా

పరిశ్రమ ఏర్పాటుపై యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించింది. అదనపు కలెక్టర్ బెన్‌షోలోమ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి కాలుష్య నియంత్రణ మండలి ఉమ్మడి జిల్లా అధికారి సంగీత హాజరయ్యారు. ఈ ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దంటూ, సిమెంట్ ఫ్యాక్టరీ గోబ్యాక్ అంటూ పెద్దఎత్తున ప్రజలు నినాదాలు చేశారు. ఆందోళనకారులు అంబుజా గోబ్యాక్, అంబుజా వద్దురా..! రామన్నపేట ముద్దురా అంటూ రామన్నపేట, సిరిపురం, కొమ్మాయిగూడెం గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల యువకులు, రైతులు, చేతి వృత్తిదారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ప్రాణాంతక వ్యాధులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. నల్ల దుస్తులు, ఫ్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఆందోళన చేపడుతున్న ప్రజల వద్దకు వచ్చిన అదనపు కలెక్టర్ మీ అభిప్రాయాలను సభా ప్రాంగణంలో తెలియజేయాలని సూచించడంతో ఆందోళనకారులు ఒక్కొక్కరుగా వెళ్లి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించవద్దని ముక్తకంఠంతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. డ్రైపోర్ట్ పేరుతో రైతులను మోసం చేసి 350ఎకరాల పచ్చని వ్యవసాయ భూములు కొనుగోలు చేశారని, ఇప్పుడు కాలుష్య ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సబ్ కోర్టు ఏర్పాటు స్థల సమీపంలో ఏర్పాటు చేయవద్దు..

ఇటీవల రామన్నపేటకు సబ్ కోర్టు మంజూరైందని పరిశ్రమకు అతి సమీపంలోనే కోర్టుకు కేటాయించిన భూమి ఉందని త్వరలోనే కోర్టు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అదనపు కల్టెర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వివిధ మండలాల నుంచి వచ్చే కక్షిదారులకు తీవ్ర ఇబ్బంది కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుకు ఫ్యాక్టరీ అనుమతులు ఇవ్వకూడదని కోరారు. అవసరమైతే ఈ విషయంపై హైకోర్టులో పిటీషన్ వేయనున్నట్లు తెలిపారు.

నిరసన సభకు అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కాలుష్య కారక సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే చేతి, కుల వృత్తులు, వ్యవసాయం తదితర పనులు పూర్తిగా దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వేదిక ఎదుట అఖిలపక్షాల ధర్నా

ప్రజాభిప్రాయ సేకరణ కంటే ముందు వేదిక వద్ద అఖిలపక్ష నాయకులు, రైతులు, ప్రజలు ధర్నా నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డుతో అంబుజా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. వివిధ గ్రామాల ఉంచి మహిళలు స్వచ్ఛందంగా ట్రాక్టర్లపై తరలివచ్చారు. ద్విచక్ర వాహనాలపై యు వకులు, రైతులు సుమారుగా 3 వేల మంది హాజరయ్యారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ బెన్ షోలోమ్ ఆందోళనకారుల వద్దకు చేరుకొని ఈ సభలో ప్రజల అభిప్రాయం తీసుకుంటామని, ఆమోదం మేరకే ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతిస్తామ ని చెప్పడంతో ఆందోళన విరమించారు. ప్రాంగణంలో అంబుజా ఫ్యాక్ట రీ వారు మంచినీరు, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినా మాపిల్లల భవిష్యత్తు నాశనంచేసే ఈ ఫ్యాక్టరీ కనీసం నీరు కూడా తాగమని పేర్కొంటూ వెనుతిరిగి వెళ్లారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు వివిధ

- మిగితా 7లో..

విద్యారంగాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం తప్పదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నల్లగొండటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం తప్పదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ రూ.6500 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. నిధులు విడుదల చేయకపోతే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌నాయక్, జిల్లా కోశాధికారి గాదెపాక సూర్య, నాయకులు సురిగి వినయ్, ఇస్కిల మహేందర్, చాపల విప్లవ్, ఎర్ర వినయ్, వట్టుపు శివకుమార్ కాంపల్లి భాను, రూపవత్ మనోజ్, శ్రీధర్, శివప్రసాద్, రవితేజ, అరున్, వీరేష్ పాల్గొన్నారు.

22 పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



చౌడంపల్లిలోని వరలక్ష్మి కాటన్ మిల్లును తనిఖీ చేసిన కలెక్టర్ నారాయణరెడ్డి

▸▸ నాణ్యమైన పత్తికి రూ.7521 మద్దతు ధర
▸▸ సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించాలి
▸▸ పత్తి రైతులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచన

నార్కట్‌పల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 22 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లిలో గల వరలక్ష్మి కాటన్ మిల్లును బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పత్తి రైతులతో మాట్లాడారు. సీసీఐ కేంద్రాలకు బదులుగా ప్రైవేట్ కంపెనీకి ఎందుకు విక్రయిస్తున్నారని ప్రశ్నించారు. వర్షాల నేపథ్యంలో పత్తిని ఆరబెట్టేందుకు అవకాశం లేకపోవడంతో తేమ శాతం ఎక్కువగా ఉందని దీంతో ప్రైవేటు కంపెనీకి విక్రయించక తప్పడం లేదని వారు సమాధానం ఇచ్చారు. 12 శాతం మించి తేమ ఉంటే పత్తికి మద్దతు ధర రాదని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా వరలక్ష్మి కాటన్ మిల్లులో ఉన్న పత్తి నిల్వల తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రైవేటు వ్యాపారులకు అమ్మకుండా నాణ్యమైన పత్తిని ప్రభుత్వ సీసీఐ కేంద్రాల్లో విక్రయించి రూ.7521 మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం చౌడంపల్లి, నార్కట్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యంలో తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ నెల 26 వరకు వర్షాలు ఉండవచ్చన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం కాంటా వేయగానే వెంటనే సంబంధిత మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీసీఐ సీనియర్ సీపీవో కృష్ణారావు, డీఎస్‌సీవో వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, మార్కెటింగ్ శాఖ అధికారి ఛాయాదేవి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుధాకర్, ఎంపీవో శ్రీదేవి, వరలక్ష్మి కాటన్ మిల్లు యజమాని కల్పనశ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

నల్లగొండ టౌన్: అంకితభావం, కష్టపడే మనస్తత్వం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ భవనంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. జీవితంలో ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తితో జీవించాలని సూచించారు. ఏ రంగంలోనైనా పోటీ సాధారణమని అన్నారు. వ్యాపారం అనేది నమ్మకం, నాణ్యత, సమయంపై ఆధారపడి ఉంటుందన్నారు. వ్యాపారంలో అందరూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన టైలరింగ్, ఎంబ్రాయిడరీలలో శిక్షణ పొందిన 88 మంది మహిళా అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ ఈ రఘుపతి, డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి : సబ్ కలెక్టర్

8లో..



ఎంత ఎదిగినా.. ఒదిగి ఉండాలని

మిర్యాలగూడ పట్టణానికి చెందిన కిషన్‌రావు-సుగుణమ్మ దంపతులది మధ్యతరగతి కుటుంబం. కిషన్‌రావు పట్టణంలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేశారు. ఆయన కుమారుడు దుర్గాప్రసాద్ ప్రాథమిక విద్య ఎన్నెస్పీ క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో, నారాయణ విద్యాలయాల్లో అభ్యసించారు. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేశారు. మాస్టర్స్ చేసేందుకు అమెరికాకు వెళ్లారు. కంప్యూటర్ సైన్స్‌పై అమితాసక్తి చూపి వినూత్న ప్రయోగాలు చేసిన దుర్గాప్రసాద్‌కు నాసా ఉపకారవేతనం ప్రకటించింది.1998లో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించిన అక్కడే స్థిరపడ్డారు. 2002లో సామాజిక కార్యక్రమాలకు అంకుర్పాణ చేసిన సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు వెన్ను దన్నుగా ఉంటున్నారు. ఎక్సలెన్సీ పేరుతో 8,9,10వ తరగతుల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించే విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలిస్తున్నారు. సోషల్ మీడియా గ్రూపుల్లో క్రియాశీల సభ్యుడిగా, అడ్మిన్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటారు. మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోని పలుప్రభుత్వ పాఠశాలల్లో సొంతఖర్చులతో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయించారు.మిత్రబృందంతో కలిసి ఏర్పాటు చేసిన ఎన్‌వీఎం డైమండ్స్, మన మిర్యాలగూడ తదితర సామాజిక మాధ్యమాలతో పర్యవేక్షిస్తుంటారు.




ప్రోత్సాహం లేక మరుగున పడొద్దనే..

విద్యార్థుల్లో దాగున్న ప్రతిభ ప్రోత్సాహం లేక మరుగున పడొద్దనేది నా ఉద్దేశం. మారుతున్న కాలంతో పాటే పాఠశాల విద్యలో సమూల మార్పులొస్తున్నాయి. డిజిటల్ విద్యపై అవగాహన లేక కరోనా లాక్‌డౌన్ లాంటి విపత్కర సమయాల్లో విద్యార్థులు ఎంతో నష్టపోయారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ విద్య అవసరం. మిత్రుల సహకారంతో విద్యార్థులు, క్రీడాకారులకు నా వంతు సాయమందిస్తున్నా.

\- దుర్గాప్రసాద్ వనమాల, ఎన్నారై(యూఎస్ఏ).

ఎల్లలు దాటినా సొంతూరిపై .. మమకారం

- అభాగ్యులకు ఆసరా, విద్యార్థులకు బాసట
- సామాజిక సేవలో భాగస్వామ్యమవుతూ
- ఎన్నారైలు దుర్గాప్రసాద్, లక్ష్మయ్య, తిరుమల్‌రెడ్డి



సొంతూరంటే వారికి ఎనలేని అభిమానం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నది అభిమతం. అభాగ్యులు, పేద విద్యార్థులకు అసరాగా ఉంటున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యమవుతున్నారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదిగారు. అమెరికాలో ఉంటున్నా సొంతూరిపై వారికి ఏమాత్రం మమకారం తగ్గలేదు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన వనమాల దుర్గాప్రసాద్, చం దూరు మండలం బొడంగిపర్తి గ్రామానికి చెందిన డాక్టర్ మంచికంటి లక్ష్మయ్య, దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామానికి చెందిన మునుకుంట్ల తిరుమల్‌రెడ్డి తమ సంపాదనలో కొంత పక్కన పెడుతూ సామాజిక సేవలో భాగస్వామ్యమై ముందుకు సాగుతున్నారు.

\- (ఆంధ్రజ్యోతి, చండూరు రూరల్, మిర్యాలగూడ టౌన్, దేవరకొండ)



ట్రస్ట్‌తో 'మంచికంటి' సేవలు

నల్లగొండ జిల్లా చండూరు మండలం బొడంగిపర్తి గ్రామానికి చెందిన మంచికంటి యాదగిరి, లక్ష్మమ్మ కుమారుడు డాక్టర్ లక్ష్మయ్య చిన్నప్పటి నుంచి చదువులో చురుకైనవాడు. వైద్య విద్యపై మక్కువతో హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. చండూరు మండలకేంద్రానికి చెందిన చంద్రకళను వివాహం చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారు. ఊరికి ఉపకారం చేయాలనే సంకల్పంతో తన నాయనమ్మ మంచికంటి గోపమ్మ పేరు మీద మంచికంటి గోపమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏడు ఎకరాల్లో అన్ని హంగులు, వసతులతో విద్యా సంస్థలు స్థాపించారు. 2003 సంవత్సరంలో ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను 155 మంది విద్యార్థులు, ఐదుగురు అధ్యాపకులతో ప్రారంభించారు. 2008లో తండ్రి మంచికంటి యాదగిరి జ్ఞాపకార్థం జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి ఉచితంగా విద్య అందించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ప్రస్తుతం జూనియర్ కళాశాల మూసివేశారు. అదే చోట ప్రభుత్వం గురుకుల బాలుర విద్యాలయం నిర్వహిస్తోంది. ప్రస్తుతం మూడు పాఠశాలల్లో మొత్తం వెయ్యి మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. తల్లి లక్ష్మమ్మ కోరిక మేరకు 2003 సంవత్సరంలో గ్రామంలో అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ప్రతి సంవత్సరం ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించి అన్నదానం నిర్వహిస్తారు.





ఉన్నతంగా ఎదిగిన విద్యార్థులు

2023 సంవత్సరం వరకు కళాశాలను ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్థులను తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో కళాశాలను నడిపించారు. సుమారు 7 వేల మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించి మంచి స్థానాల్లో ఉద్యోగాలు సాధించారు. ఎంతో మంది డాక్టర్లు, ఇంజినీర్లు, వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. ఆరేళ్లుగా ట్రస్ట్ ద్వారా నిధులు సమకూరకపోవడంతో కొన్ని అనివార్య కారణాలతో కళాశాల నిర్వహణ భారం పెరగడంతో ప్రభుత్వ సాయం కోరారు. కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిర్వహించాలని కోరినా అధికారులు, నాయకులు స్పందించక పోవడంతో చేసేది లేక కళాశాలను మూసివేశారు.



ఎన్ని అడ్డంకులు వచ్చినా ట్రస్ట్ సేవలు ఆగవు

మంచికంటి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామానికే కాకుండా మండల పరిసర ప్రాంత ప్రజలకు విద్యార్థులకు ఎన్నో సేవలు అందించాం. ఆరేళ్లుగా ట్రస్ట్ ద్వారా నిధులు సమకూరకపోవడంతో మా అన్నయ్య డాక్టర్ మంచికంటి లక్ష్మయ్య ప్రస్తుతం సొంత ఖర్చులతో ప్రతి నెల రూ.1.70 లక్షలతో పాఠశాల, గుడి నిర్వహణ చేస్తున్నారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా మంచికంటివారి సేవలు ఆగవు.

\- మంచికంటి వెంకటరమణ, ట్రస్ట్ చైర్మన్



గ్రామానికి అండగా ఉంటూ..

దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మునుకుంట్ల విద్యావతి, వెంకట్‌రెడ్డి దంపతుల రెండో కుమారుడు మునుకుంట్ల తిరుమల్‌రెడ్డి అమెరికాలో వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. గ్రామంలోని సొంత భూమిలో రూ.15లక్షలతో కమ్యూనిటీ వైద్యశాల నిర్మించారు. కొండభీమనపల్లి ప్రాథమిక పాఠశాల, అదనపు గదులు, తాగునీటి సౌకరానికి రూ.30 లక్షలుకేటాయించి కల్పించారు. రూ.10లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. గ్రామానికి రోడ్లు,తాగునీటి సౌకర్యం కల్పించారు. కమ్యూనిటీహాల్ నిర్మించారు. దేవాలయ నిర్మాణానికి విరాళాలు అందజేసి నిర్మించారు. నిరుపేదలకు అడిగిన వెంటనే సహాయ,సహకారాలు అందిస్తున్నారు. ఆయన తల్లి మునుకుంట్ల విద్యావతి వెంకట్‌రెడ్డి గత గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్‌గా గెలుపొంది గ్రామ అభివృద్ధికి కృషిచేశారు. తిరుమల్‌రెడ్డి అమెరికాలో వ్యాపార రంగంలో రాణిస్తూ ప్రతి సంవత్సరం గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో గడిపి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.



సేవలు విస్తృతం చేస్తా...

గ్రామ అభివృద్ధికి సేవ చేయాలనేది లక్ష్యం. తల్లిదండ్రుల సహకారంతో మునుకుంట్ల ఫౌండేషన్ సేవలను విస్తృతపరుస్తా. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాను. పుట్టిన ఊరికి ఎంతో కొంతసేవ చేయాలన్నదేనా లక్ష్యం.

\- మునుకుంట్ల తిరుమల్‌రెడ్డి, ఎన్ఆర్ఐ కొండభీమనపల్లి.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.148	214	244

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.50
టీఎంసీలు	310.5510
ఎడమకాల్వకు నీటి విడుదల	6173
కుడికాల్వకు	10,120
విద్యుత్ కేంద్రం ద్వారా	29,516
క్రస్ట్ గేట్ల ద్వారా	15,928
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	66,441 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	48,609 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

\- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.43 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	31,274
అవుట్‌ఫ్లో	16 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

\- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.70 అడుగులు
టీఎంసీలు	4.12
ఎన్ని గేట్ల ద్వారా	3 గేట్ల ద్వారా
ఇన్‌ఫ్లో	1005.89 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	1454.65 క్యూసెక్కులు

\- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	21 అడుగులు

\- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

బుద్ధగయ పర్యాటకులను బుద్ధవనానికి తీసుకురండి

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



బుద్ధగయలో ట్రావెల్ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

నాగార్జునసాగర్, సూర్యాపేటటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్ట సందర్శనకు బుద్ధగయ పర్యాటకుల్ని తీసుకురావాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. రెండు రోజులుగా బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహిస్తున్న అసోషియేషన్ ఆఫ్ బుద్ధిస్ట్ టూర్ ఆపరేటర్స్ (ఏబీటీవో) కార్యక్రంలో పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన ట్రావెల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుద్ధగయ ట్రావెల్ ఏజెంట్లు, ఆపరేటర్ల కోసం త్వరలో బుద్ధవనానికి పరిచయ పర్యటనను ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణలో పర్యాటక రంగం అభివృద్ధే లక్ష్యమన్నారు. తెలంగాణ పర్యాటక రంగం ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. బుద్ధగయ, రాజగృహంలో బుద్ధుడు నివసించిన స్థావరాలను, బుద్ధుడి ఆనవాళ్ళు, గ్రంథాలు విశేషాలను ఏబీటీవో ప్రధాన కార్యదర్శి కౌలేష్‌కుమార్ బృందానికి వివరించారు. అదేవిధంగా నలందా మహావిశ్వవిద్యాలయాన్ని, బౌద్ధ ప్రదర్శనశాలను బౌద్ధ కట్టడాలను తిలకరించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ విశ్లేషకులు ఈమని శివనాగిరెడ్డి, ఏబీటీవో జనరల్ సెక్రటరీ హంస, హాలిడేస్ అధినేత కౌలేష్‌కుమార్ ఉన్నారు.

నేడు సూర్యాపేటకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



సూర్యాపేట కలెక్టరేట్‌ను ముస్తాబు చేసిన అధికారులు

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి రానున్నారు. ఉదయం 8.30గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి రోడ్డుమార్గంలో సూర్యాపేట కలెక్టరేట్‌కు ఉదయం 10.30గంటలకు చేరుకుంటారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమావేశం నిర్వహిస్తారు. అనంతరం జిల్లాలోని పలువురు కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలు, ప్రముఖులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో భోజనం చేసిన అనంతరం రోడ్డు మార్గంలో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాకు వెళతారు. గవర్నర్ పర్యటన సందర్భంగా సూర్యాపేట కలెక్టరేట్‌లో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పర్యవేక్షించారు. గవర్నర్ పర్యటనలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వవద్దని, అన్ని శాఖల అధికారులు తమ శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్‌ను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. అదే విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఛాయా చిత్ర ప్రదర్శన, వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. సూర్యాపేటకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాక సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో మొత్తం 90మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. గవర్నర్ సూర్యాపేటకు వచ్చి తిరిగి వెళ్లే వరకు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

గవర్నర్‌ను కలిసిన మంత్రి ఉత్తమ్ దంపతులు



గవర్నర్‌ను కలిసిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అంచనాల కమిటీ చైర్‌పర్సన్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు గవర్నర్‌ను సన్మానించారు. గురువారం సూర్యాపేట జిల్లా పర్యటనకు విచ్చేయున్న గవర్నర్‌తో పలు అంశాలపై చర్చించారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నల్లగొండలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్14-17 విభాగం కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని ఏవీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో వి. తేజశ్రీ, వి. శ్రీనిత్య, ఎల్ లిఖిత, బాలుర విభాగంలో ఎం. చరణ్, ఎ. జగదీష్, పి. రామచంద్ర, జె. కృష్ణుడు, యు. సాయి చరణ్, అండర్-17 బాలుర విభాగంలో ఎం. ప్రణయ్ ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల పీఈటీ నిమ్మల శంకర్, ఉపేందర్ తెలిపారు. విద్యార్థులను ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాళ పాపిరెడ్డి, ప్రిన్సిపాల్ స్వప్నా రెడ్డి, కందాళ శ్రీకాంత్‌రెడ్డి, పీఆర్‌వో పూర్ణచంద్రారెడ్డి, జితేందర్‌రెడ్డి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.32,15,770

నార్కట్‌పల్లి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ ఖజానాకు రూ.32,15,770ల ఆదాయం సమకూరింది. 70 రోజులుగా రామలింగేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా, నగదు రూ.32,15,770 లభించింది. ఉపాలయాల వద్ద ఉన్న హుండీ కానుకలను లెక్కించగా రూ.24,43,040, గుట్ట కింద అమ్మవారి ఆలయం హుండీల ద్వారా రూ.7,72,730, నిత్యాన్నదాన సత్రం విరాళాల కింద రూ.1,23,931 సమకూరాయి. కార్యక్రమంలో ఈవో సిరికొండ ఈవో నవీన్‌కుమార్, ఎండో మెంట్ డివిజన్ పరిశీలకురాలు సుమతి, శ్రీదుర్గ శివసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

భూ సర్వే పరిశీలన

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల ఖాస్తు కబ్జా ఆధారంగా భూ సర్వే నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రెవెన్యూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా సర్వేను పరిశీలించడానికి బుధవారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని చింతలపాలెం గ్రామానికి వచ్చారు. సర్వే నెం.60లో నిర్వహిస్తున్న రైతుల భూ సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు.

సమాజ రక్షకుడు, వ్యవసాయ ప్రేమికుడు

- వ్యవసాయంపై మక్కువతో ముందుకు సాగుతున్న ఎస్ఐ
- ఎడారి దేశం నుంచి ఖర్జూర మొక్కలు దిగుమతి
- తేనెటీగల పెంపకంతో స్వచ్ఛమైన తేనె అందిస్తున్నానంటున్న శ్రీనునాయక్

సమాజ రక్షకుడిగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే వ్యవసాయంపై ఉన్న మక్కువతో వ్యవసాయాన్నీ ఫలసాయంగా మారుస్తూ ముందుకు సాగుతున్నారు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్ఐ బాణోతు శ్రీనివాస్‌నాయక్. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన వ్యవసాయంపై ఉన్న అభిలాషతోనే సెలవు రోజుల్లో వీలు చిక్కినప్పుడల్లా వ్యవసాయంపై దృష్టి సారిస్తుంటారు. ఖర్జూర సాగుతో పాటు తేనెటీగల పెంపకం చేపట్టి స్వచ్ఛమైన తేనె అందిస్తున్నారు. కొత్త పంటలు సాగు చేయాలన్న కోరికతో ఖరీదైనప్పటికీ ఎడారి దేశం నుంచి ఖర్జూర మొక్కలు తెప్పిస్తుంటారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

శ్రీనివాస్‌నాయక్ స్వస్థలం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని శాంతినగర్. గ్రామం. హుజూర్‌నగర్‌లో ఇంటర్మీడియెట్ విద్యను పూర్తిచేసిన ఆయన పట్టుదలతో శ్రమించి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. 1989లో మిర్యాలగూడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరారు. 2000 సంవత్సరంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించారు. 2016లో ఏఎస్ఐగా మఠంపల్లి పిఎస్‌లో పనిచేసి 2023లో ఎస్ఐగా పదోన్నతి సాధించి నల్లగొండ సీసీఎస్‌లో కొంతకాలం పనిచేశారు. తాను కానిస్టేబుల్‌గా చేరిన పోలీస్‌స్టేషన్‌లోనే ప్రస్తుతం ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



ఖర్జూరా పచ్చి గెలతో శ్రీనునాయక్

ఎడారి దేశం నుంచి మొక్కలు తెప్పించి

ఎకరం పది గుంటల భూమిలో డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసి దుబాయి అబుదాబి నుంచి 2017లో 100 ఖర్జూర మొక్కలు తెప్పించి నాటారు. అంతర్ పంటగా సీతాఫలం, జామ మొక్కలు నాటారు. ఏడాదినుంచి ఖర్జూర పంట కొంతకొంతగా చేతికి వస్తోంది. అబుదాబి నుంచి తెప్పించి నాటిన మొక్కలు చాల ఖరీదైనవి. సంవత్సరం వయస్సు ఉండే ఖర్జూరం మొక్క ఒక్కొక్కటి రూ.4,500 నుంచి ప్రత్యేకతను బట్టి రూ.17వేల వరకు ధర పలుకుతోంది. తమిళనాడుకు చెందిన ఏజెంట్ ద్వారా రూ.4,500 విలువైన 60 మొక్కలు, ఖరీదు కలిగిన 40 ప్రత్యేక మొక్కలను విమానంలో తెప్పించారు. ఐదు సంవత్సరాల తర్వాత వాటిలో 60శాతం మొక్కలు కాపు కాయడం ప్రారంభించాయి. ఒక్కో చెట్టు 8 నుంచి 10 గెలలు కాస్తుంటాయి. ఒక్కో గెల 6 నుంచి 10 కేజీల బరువు ఉంటుంది. పచ్చి ఖర్జూర పండ్లు కేజీ రూ.250లకు, పండిన ఖర్జూరాలను కేజీ రూ.500 నుంచి 600లకు తోటలోనే విక్రయిస్తుంటారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న తేనె

తేనెటీగల పెంపకం.. ముగ్గురికి ఉపాధి

తేనెటీగల పెంపకం ద్వారా మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నారు. శ్రమకు తగిన ఆదాయం కూడా అర్జిస్తున్నారు శ్రీనునాయక్. 2021లో మొదట రూ.15 వేల విలువైన 14బాక్స్‌లు కొనుగోలు చేశారు. ఆ సంఖ్య క్రమంగా 100 బాక్స్‌లకు చేరింది. ఒక్కో బాక్స్‌లో ఎనిమిది ఫ్రేమ్‌లు ఉంటాయి. వివిధ ప్రాంతాల్లో రైతులు సాగుచేసే పంటలు పూతదశలో ఉన్నప్పుడు తన సొంత ఆటోలో తేనేటీగల బాక్స్‌లను తీసుకెళ్లి 20రోజులపాటు అక్కడే తాత్కాలిక నివాసముంటారు. ఉదయం వేళ తోటల పరిసరాల్లోకి వెళ్లి ఆటోల్లో తెచ్చిన తేనెటీగల బాక్స్‌లు తెరవగానే పూల మకరందం కోసం తేనేటీగలు ఎగిరిపోతాయి. సాయంత్రం సమయానికి తిరిగి వచ్చి ఏ బాక్స్‌లోని ఈగలు ఆ బాక్స్‌లో చేరుతాయి. రాత్రి సమయంలో వాటిని సీల్‌చేసి తమ తాత్కాలిక నివాసానికి తీసుకెళ్తారు. పరిసరాల్లో క్రిమిసంహార పురుగు మందులు స్ప్రే చేసే పరిసరాలకు దూరంగా ఉంచుతారు. పూలు బాగా ఉంటే 20 రోజలు, తక్కువగా ఉంటే 25రోజుల్లో తేనేపట్టు సిద్ధమవుతుంది. తేనేపట్టు తీయడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలి నుంచి రూ.10 నుంచి రూ.20వేలు వెచ్చించి కూలీలను రప్పిస్తారు. వారు తేనె పట్టును పిండకుండా చుట్టూ పరదాలు వేసి ఒక ప్రత్యేక పద్ధతిలో తేనె తీస్తారు. ఒక్కో బాక్స్ నుంచి 3నుంచి 4 కేజీల తేనె తయారవుతుంది. కేజీ తేనే రూ.600 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు టన్నుల తేనె విక్రయించారు.



ఖర్జూర గెలను పరిశీలిస్తున్న రాజేశ్వరి

భర్తకు తోడుగా..

భర్త శ్రీనునాయక్‌కు వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉంటున్నారు ఆయన సతీమణి బాణోతు రాజేశ్వరి. భర్త విధుల్లో ఉన్నప్పుడు ఖర్జూర తోటలో తానూ పనిచేస్తూ కూలీలతో పని చేయిస్తూ నిలుస్తున్నారు. మొక్కలకు ఆర్గానిక్ ఎరువులు అందించడం, ఖర్జూర చెట్లకు వచ్చిన ముల్లులు తీసివేయడం, తేనేటీగల బాక్స్‌ల నిర్వహణ పనులు చేయిస్తుంటారు.

సాగుపై ఉన్న అభిలాష ఆదాయం తెచ్చిపెడుతోంది



చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై ఉన్న ఇష్టం ఇప్పుడు ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. కొత్త పంటలు సాగు చేయాలన్న మక్కువతో ఖరీదైనప్పటికీ ఎడారి మొక్కలు తెచ్చి ఆర్గానిక్ ఎరువులతో పంటలు సాగు చేస్తున్నా. ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న తేనెలో కల్తీ ఉందని ప్రజలకు అనుమానాలున్నాయి. అందుకే వాళ్ల కళ్లముందే మా వద్ద సహజ సిద్ధంగా తయారైన తేనెను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

● శ్రీనునాయక్, వన్‌టౌన్ ఎస్ఐ మిర్యాలగూడ.



అనాథల అమ్మ

ఆమె ఒక మామూలు మహిళ. నిరక్షరాస్యురాలు. ఆర్థిక బలం లేదు. గుండె ధైర్యం, ఆత్మస్థైర్యం ఉంటే చాలని నిరూపిస్తోన్నది నల్లగొండ మండలం పెద్దసూరారం గ్రామానికి చెందిన పిచ్చమ్మ. జిల్లా కేంద్రంలో ఆశ్రమం ఏర్పాటు చేసి ఎంతో మంది అనాథలు, వృద్ధులను అక్కున చేర్చుకొని కంటి రెప్పలా కాపాడుతూ అమ్మలకే అమ్మగా నిలుస్తోంది.

\- నల్లగొండటౌన్

ఏ దిక్కులేని వృద్ధులు, అనాథలకు అండగా ఉండాలని 27 ఏళ్ల క్రితం శాంతి మహిళా మండలి వృద్ధాశ్రమాన్ని స్థాపించారు పిచ్చమ్మ. ఏడుగురితో ప్రారంభమైన వృద్ధాశ్రమం ప్రస్తుతం 35 మందితో కొనసాగుతోన్నది. మొదట్లో వృద్ధాశ్రమం అద్దె చెల్లించడానికి డబ్బులు కూడా లేకపోవడంతో ఇంటి యజమాని తాళం వేశారు. దాంతో అప్పటి హోం మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి, కలెక్టర్ నీలం సహాని సహకారంతో కలెక్టరేట్ సమీపంలో ఓ పాత ఇంటిని అద్దెకు తీసుకొని వృద్ధాశ్రమం కొనసాగిస్తున్నారు. దాతల సహకారంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంవత్సరం ఫండ్‌తో వృద్ధాశ్రమం నిర్వహిస్తోన్నది.

వ్యవసాయ కూలీ నుంచి ప్రస్థానం

పుట్టుగానే తండ్రిని, చిన్న వయస్సులోనే భర్తను, ఆ వెంటనే బిడ్డను పోగొట్టుకుని ఒంటరిగా మిగిలిన పిచ్చమ్మకు చదువు లేదు. పొట్ట కూటి కోసం వ్యవసాయ కూలీ పనులు చేస్తూనే ఆమె మహిళా మండలిని స్థాపించి వారికి అండగా నిలుస్తోంది. తనలా ఒంటరి మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడొద్దని వందలాది మంది ఒంటరి, వితంతు మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పిస్తోంది. ఈ సంస్థ ద్వారా నిరక్షరాస్యులైన మహిళల్లో చైతన్యం తెచ్చేలా శ్రీకారం చుట్టారు. అక్షరాస్యతతో పాటు కుట్టుమిషన్లు, బుట్టల అల్లికలు వంటివి శిక్షణ ఇప్పించింది. ఆశ్రమంలో ఉంటూ ఎవ్వరైనా మృతి చెందితే అన్ని తానై ముందుండి అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు ఆమె.కరోనా వంటి కష్ట కాలంలో సైతం ఆమె చేసిన సేవా ఆదర్శప్రాయం.

ఎందరో ప్రశంసలు.. ఎన్నో అవార్డులు

ఏ అండలేని నిరుపేద వృద్ధులకు అన్నీ తానై అండగా నిలుస్తోన్న పిచ్చమ్మ ఎందరో గొప్ప గొప్ప వారి ప్రశంసలను అందుకున్నారు. మహిళా మండలి స్థాపించిన దగ్గరి నుంచి పనిచేసిన కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మన్ననలు పొం దారు. ప్రతి సంవత్సరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆమె సేవల ను గుర్తించి జిల్లా అధికార యంత్రాంగం తరఫున ప్రత్యేకంగా సన్మానిస్తున్నది. అలాగే గత ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ అవార్డు ప్రదానం చేశారు.



అనాథలకు గూడు కట్టించడమే లక్ష్యం

వృద్ధులు, అనాథలకు సేవ చేయడంలో సంతృప్తిగా ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా ఎంతో మందికి సేవలందించాను. అందులో ఉన్న సంతృప్తి నాకు ఎందులో దొరకదు. 65 ఏండ్ల పైబడిన నాకు చివరి కోరిక ఒకటే అనాథలు, అభాగ్యుల కోసం అందరి సహకారంతో గూడు కట్టించడమే నా లక్ష్యం. దాతల సాయంతో కరోనా లాంటి కష్ట కాలంలో సైతం ఆశ్రమంలోని వృద్ధులను అక్కున చేర్చుకున్నారు. వారందరికీ కృతజ్ఞతలు.

\- పొడిశెట్టి పిచ్చమ్మ, ఆశ్రమ నిర్వాహకురాలు

- 27 ఏళ్ల క్రితం శాంతి మహిళా మండలి ఏర్పాటు
- ఎంతో మంది ఒంటరి మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ



ఆశ్రమంలో మృతి చెందిన అనాథ మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహిస్తున్న పిచ్చమ్మ

తనలా కాకూడదని..

- డ్రాపౌట్స్‌పై అధికారులకు సమాచారం ఇస్తున్న ఇందుప్రియ
- 10 పైగా బాల్యవివాహాల అడ్డగింత
- జాతీయ వేదికపై గళాన్ని వినిపిస్తున్న జిల్లా యువతి

ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు సామాజిక బాధ్యతను నిర్వహిస్తోంది మద్దెల ఇందుప్రియ. ఇప్పటికే 50 మందికి పైగా డ్రాపౌట్స్‌ను బడికి వెళ్లేలా చేసింది. 10కి పైగా బాల్యవివాహాలను అడ్డుకుంది. తనలా మరొకరు డ్రాపౌట్స్ కావద్దంటూ పలు వేదికలపై తన గళాన్ని వినిపిస్తోంది ఇందుప్రియ. చదువుకుంటూనే సామాజిక బాధ్యతను ఒక సైనికుడిలా నిర్వహిస్తోంది.

\- డిండి, ఆంధ్రజ్యోతి



నల్లగొండ జిల్లా డిండి మండలం తవక్లాపూర్ గ్రామానికి చెందిన మద్దెల రాములు, లింగమ్మ దంపతుల ఆరుగురు కుమార్తెల్లో చిన్నది. తన తండ్రి మరణంతో ఏడేళ్ల వయసులోనే తల్లితో పాటు కూలీ పనులకు వెళ్లేది. చదువుకోవాలని తపన ఉన్నా తల్లి, ఇంటి పరిస్థితి చూసి పనులకు వెళ్లేది. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో బడిలో చేరింది. ఐదవ తరగతి వరకు చదివి బడి మానేసింది. అంతకుముందు అప్పుడప్పుడు బడి మానేసి కూలీ పనులకు వెళ్తుండేది.

మలుపుతిప్పిన చైల్డ్ వెల్ఫేర్

ఇందుప్రియ కూలీ పనులకు వెళ్తున్న క్రమంలోనే గ్రామంలో ప్రారంభమైన యాంటీ చైల్డ్ లేబర్ ప్రాజెక్టు, మహిత ప్లాన్ ఇండియా వారు ఇందును గుర్తించి ఆర్థిక సహాయం అందించి 7వ తరగతిలో చేర్పించారు. 10వ తరగతి వరకు గ్రామంలోనే పూర్తి చేసి ఇంటర్ డిండి మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో పూర్తి చేసింది. హైదరాబాద్‌లోని చింతలబస్తీలో బీకాం డిగ్రీ పూర్తి చేసి ఎస్‌ఐ పోటీ పరీక్షకు సిద్ధమవుతోంది.

జాతీయ వేదికపై...

ప్లాన్ ఇండియా, మహిత సంస్థల ఆధ్వర్యంలో 2018లో ఢిల్లీలో జరిగిన బాలల హక్కులు, బాలికల విద్యకు అవరోధాలు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మాట్లాడే అవకాశం ఒక ఇందుకే దక్కింది. తన వాగ్ధాటితో అనర్గళంగా మాట్లాడి దేశ, విదేశ ప్రతినిధులను ఆకట్టుకుంది. ప్రస్తుతం చైల్డ్ ఫోరం కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా వ్యవహరిస్తోంది.

ఎస్‌ఐ కావాలన్నదే నా లక్ష్యం

సామాజిక సేవచేయాలని ఉన్నా అమ్మ కోరిక మేరకు ఎస్‌ఐ కావాలని తీవ్రంగా శ్రమిస్తున్నా. సామాజిక సేవతో పాటు చెడుపై పోరాడవచ్చునని ఎస్‌ఐ ఉద్యోగం సాధించాలని శిక్షణ తీసుకుంటున్నా.మరో అమ్మాయి నాలా డ్రాపౌట్ కాకూడదనేది నా ఉద్దేశ్యం. అమ్మ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తూ నన్ను చదివిస్తోంది.

\- మద్దెల ఇందుప్రియ



బాలికలను కాపాడుతూ..

డ్రాపౌట్స్ పాఠశాలలో చేర్పించాలనే లక్ష్యంగా మహిత ప్లాన్ ఇండియా పనిచేసేది. ఇది ఇందు మనస్సులో స్ఫూర్తిని నింపింది. తనలా ఎవరూ కాకూడని నిర్ణయించుకున్న ఆమె అధికారులు గ్రామానికి వచ్చినప్పుడు బడిబయట ఉన్న పిల్లల వివరాలను అధికారులకు తెలిపేది. చుట్టుపక్కల పిల్లలు బడి మానేసి కూలీ పనులకు వెళుతున్నారని తెలియగానే ఆ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేది. అధికారులు తల్లిదండ్రులకు నచ్చచెప్పి వారిని బడిలో చేర్పించేవారు. గ్రామంలో సుమారు 50మంది పిల్లలను బడికి వెళ్లేలా చేసింది. అదేవిధంగా గ్రామంలో బాలికలకు పెళ్లిళ్లు చేసేవారు. అలా ఆడపిల్లల భవిష్యత్ నాశనం అవుతుందని భావించి వివాహాల సమాచారాన్ని అధికారులకు చేరవేసి బాల్యవివాహాలను అడ్డుకునేది. సుమారు 10కిపైగా బాల్యవివాహాలను అడ్డుకోగలిగింది. గ్రామంలో మహాత్మాగాంధీ పేరుతో చైల్డ్ ఫోరం కమిటీ ఏర్పాటైంది. ఇందులో ఇందుప్రియతో పాటు 20 మంది సభ్యులు ఉంటారు. డ్రాపౌట్స్ తగ్గించడానికి జరిగే అవగాహన కార్యక్రమాలకు వెళుతూ బాలల హక్కులకు సంబంధించి జరిగే సెమినార్లకు హాజరవుతుంది.

పోరాటాల ఫలితంగా సమగ్ర కులగణన

\- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గల్లీ నుంచి ఢిల్లీ వరకు చేసిన అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణన చేపట్టడానికి జీవో నంబర్ 18ను విడుదల చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర కుల గణనలో బీసీలలోని అన్ని కులాలు భాగస్వాములై తమ కుటుంబ స్థితిగతులను నమోదు చేసుకోవాలన్నారు. దీనిపై కుల సంఘాల నాయకులు గ్రామ పట్టణ స్థాయి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. బీసీ కచ్చితమైన జనాభా లెక్కలు తేలినప్పుడే అన్ని రంగాల్లో వాటా దక్కుతుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా రెండు నెలల్లో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. 8 శాతం కూడా లేని అగ్రవర్ణాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడుతూ జీవో 29 ద్వారా బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని వెంటనే ఆ జీవోను వెనక్కి తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్ ముదిరాజ్, చిక్కుళ్ల రాములు, కాశయ్య గౌడ్, కైలాసం, భాస్కర్, మధు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎంజీయూ వీసీ



గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి విష్ణుదేవ్‌వర్మను ఎంజీయు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి విశ్వవిద్యాలయం ప్రగతిని, చేయబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

మద్యం విక్రేత ఇంటి ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న గట్టికల్ గ్రామస్థులు

ఆత్మకూర్(ఎస్),అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని గట్టికల్ గ్రామంలో మద్యం నిషేధంపై గ్రామస్థులు కట్టుబాటు చేసుకున్నారు. ఈ కట్టుబాటు వ్యతిరేకంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి రోజున సంపూర్ణ మద్యపాన నిషేధం చేయాలని గ్రామస్థులు ఐక్యంగా తీర్మానం చేశారు. అధికారులకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం విక్రయించొద్దని గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీ సులు అందజేశారు. ఈ నిబంధనను ధిక్కరించి గ్రామంలో తన్నీరు యాదగిరి మద్యాన్ని విక్రయిస్తుండగా గ్రామ యువకులు రెడ్ హ్యాండడ్‌గా పట్టుకుని పోలీసులకు పట్టించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు యాదగిరిని పిలవగా, రాలేదు. గ్రామస్థులు ర్యాలీగా యాదగిరి ఇంటికి వెళ్లి ఇంటి ఎదుట శాంతియుతంగా దీక్ష చేపట్టారు. అనంతరం యాదగిరి గ్రామస్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాడు. అనంతరం ఆత్మకూర్(ఎస్) పోలీసులు రూ.2లక్షల పూచీకత్తుతో యాదగిరిపై బైండోవర్ కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఏఎస్‌ఐ శంకర్ నాయక్ గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, 10 నిమిషాల్లో గ్రామానికి చేరుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోదాడ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలానికి చెందిన జమ్ముల సురేష్ మూడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో ఆంధ్రాకు తరలిస్తుండగా, న్నారు. మండలంలోని దోరకుంట గ్రామ సర్వీస్ రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టెన్షన్... టెన్షన్...



అభిప్రాయ సేకరణ సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్ షాలోం

(5వ పేజీ తరువాయి)

గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కాలుష్య కారక సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే చేతి, కుల వృత్తులు, వ్యవసాయం తదితర పనులు పూర్తిగా దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అదనపు కలెక్టర్ కాన్వాయిని అడ్డుకున్న ప్రజలు

ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన సభలో సభలో ముక్తకంఠంతో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని అభిప్రాయం తెలిపారు. అయితే ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన అదనపు కలెక్టర్ తమ అభిప్రాయం ప్రకటించకుండా వేదిక నుంచి వెళ్తుండగా ప్రజలు ఆయన కాన్వాయిని అడ్డగించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ కోటిరెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ పి.మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ లాల్ బహదూర్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మల్లయ్య, అఖిలపక్షాల నాయకులు ఎండీ జహంగీర్, మేక అశోక్‌రెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, కల్లూరి మల్లేశం, జినుకల ప్రభాకర్, పూస బాలకిషన్, గంగుల రాజిరెడ్డి, ఎండి రేహన్, పెంటయ్య, నర్సింహ, గాదె శోభారాణి, గోదాసు శిరీష, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో బంద్

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ బుధవారం రామన్నపేట బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలు, హోటళ్లు, వ్యాపారసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. దీంతో పట్టణంలోని వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. సిమెంట్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయ కార్యక్రమం అనంతరం దుకాణాలు తెరిచారు. నెల రోజులుగా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని వివిధ రూపాల్లో ప్రజలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

మోత్కూరుకు మాజీ ఎంపీ తరలింపు

మోత్కూరు: రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ను మార్గమధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. పట్టణం వెలుపలే అరెస్టు మోత్కూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలిసి బీఆర్ఎస్ మండల నాయకులు పోలీస్‌స్టేషన్ వెళ్లి ఆయనకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల సుమారు పదిహేను గ్రామాల ప్రజలు కాలుష్యం కోరల్లో చిక్కిశల్యమవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తున్నామని గొంతు చించుకునే కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పకుండా అరెస్టు చేయించడమేమిటని ఆయన ప్రశ్నించారు. రెండు, మూడు గంటల పాటు ఆయన్ను మోత్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి, ఆ తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రమేష్, జంగ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పిచ్చయ్య నాయకులు కొండ సోమల్లు, మర్రి అనిల్‌కుమార్, పరమేష్, విద్యాసాగర్, శోభన్‌బాబు, శ్రీను, ఇంద్రశేఖర్, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమను ఆపకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం : చిరుమర్తి



చిరుమర్తిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చిట్యాలరూరల్: రామన్నపేట శివారులో ప్రజలకు ఇబ్బందులు కలిగే సిమెంటు పరిశ్రమను ప్రభుత్వం ఆపకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి శివారులో హోటల్ వద్ద మాజీ ఎమ్మెల్యే లింగయ్య ఉన్నట్లుగా సమాచారం తెలుసుకున్న నార్కట్‌పల్లి సీఐ, చిట్యాల, నార్కట్‌పల్లి ఎస్‌ఐలు పోలీసు సిబ్బందితో అడ్డుకుని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సీఐ నాగరాజు, ఎస్‌ఐలు ధర్మా, క్రాంతికుమార్, సిబ్బంది కలిసి చిరుమర్తి లింగయ్యను ఎత్తుకుని పోలీసు వాహనం ఎక్కించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ అభిప్రాయాన్ని చెప్పేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అనంతరం ఆయన్ను నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటాం

- బీఆర్ఎస్ నేతల స్పష్టీకరణ
- పలువురు మాజీ ఎమ్మెల్యేల హౌజ్ అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు కల్పించినా అదానీ గ్రూపునకు చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకొని తీరుతామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీతో పాటు మాజీ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎంత నిర్బంధించినా ప్రజల పక్షాన తాము పోరాటం చేస్తామని తెలిపారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ఆ ప్రాంత ప్రజలకు రైతులకు ఇబ్బందులు కలుగుతాయని, అయినా ప్రభుత్వం అదానీ గ్రూపునకు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డ్రైపోర్ట్ పేరిట 400 ఎకరాల వరకు ప్రభుత్వం భూసేకరణ చేసి సిమెంట్ ఫ్యాక్టరీని అప్పగిస్తుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం ఆశ్చర్యంగా ఉందని, ప్రొటోకాల్ ఉన్న తనను కూడా అడ్డుకునే ప్రయత్నం చేశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్ మాట్లాడుతూ పోలీసులు ఎవరి ప్రోద్బలంతో తమ పార్టీ నాయకులను నిర్బంధించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఆయన సోదరుడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి రామన్నపేటలో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీపై తమ అభిప్రాయాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. మూసీ ప్రక్షాళన అంటూ పేదల ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం సిమెంట్ ఫ్యాక్టరీ పేరిట రైతులను, ప్రజలను సమస్యల్లోకి నెట్టివేస్తున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, నాయకులు చెరుకు సుధాకర్, మాలే శరణ్యారెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, దేప వెంకటరెడ్డి, గణేష్, జమాల్‌ఖాద్రీ, శ్రీనివాస్‌రెడ్డి, గోపి, స్వరూప, నాగార్జున పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేల హౌజ్ అరెస్టు, ఉద్రిక్తత

నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్‌తో పాటు కంచర్ల భూపాల్‌రెడ్డిని హౌజ్ అరెస్టు చేశారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి రామన్నపేటకు వెళ్లడానికి నల్లగొండలోని కంచర్ల క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు ఇద్దరిని హౌజ్ అరెస్టు చేశారు. దీంతో వారు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని జాతీయ రహదారిపై అరెస్టు చేసి నల్లగొండలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తీసుకువచ్చారు. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావును అరెస్టు చేసి భువనగిరి ఎస్పీ ఆఫీస్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌ను, నోముల భగత్‌లను పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి సైతం ప్రొటోకాల్ ఉన్నా అడ్డుకునే ప్రయత్నం చేసి ఆ తర్వాత అనుమతించినట్లు సమాచారం.

తల్లిదండ్రుల చెంతకే చిన్నారి

భావోద్వేగంతో అప్పగించిన పెంచిన తల్లి



అధికారుల సమక్షంలో కన్నతల్లి ఒడికి చేరుతున్న శిశువు

భువనగిరి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శిశు విక్రయం జరిగిందని సీడబ్ల్యూసీ నిర్వహించిన కౌన్సెలింగ్ మేరకు పెంచిన తల్లిదండ్రుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆడ శిశువును కన్న తల్లిదండ్రులకు అప్పగించారు. శిశు విక్రయం ఘటనలపై కౌన్సెలింగ్ నిర్వహించి దర్యాప్తు చేశారు. ఈ ఘటనపై తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను సీడబ్ల్యూసీ బెంచ్ ఆదేశించింది. అలాగే ప్రతీవారం అంగన్‌వాడీ టీచర్ కన్న తల్లిదండ్రుల ఇంటిని సందర్శించి పాప బాగోగులను పర్యవేక్షించి నివేదిక అందజేయాలని సీడబ్ల్యూసీ సూచించింది. ఎల్లల దత్తత కోసం సొంత జిల్లాలోని డీసీపీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పెంపుడు తల్లిదండ్రులకు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ సూచించారు.

45రోజుల క్రితం ఇలా..

తుర్కపల్లి మండలం రాంపురతండాకు చెందిన దంపతులకు మూడో కాన్పులో ఆడపిల్ల జన్మించటంతో పరిచయస్థుల ద్వారా సిద్దిపేటలోని పిల్లలు లేని దంపతులకు అప్పగించారు. విషయం తెలుసుకున్నజిల్లా బాలల సంరక్షణ విభాగం(సీడబ్ల్యూసీ), అంగన్‌వాడీ టీచర్లు అప్రమత్తమై జన్మనిచ్చిన, సాదుకుంటున్న తల్లిదండ్రులను గుర్తించి సీడబ్ల్యూసీ ముందు ప్రవేశపెట్టారు. శిశువును అప్పగించేందుకు పెంచిన తల్లి అంగీకరించకపోవడంతో చిన్నారి సహా సఖి కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై బుధవారం కౌన్సెలింగ్ చేశారు.

మా ఇంటికి వచ్చిన సంతాన లక్ష్మిగా భావించాం

పిల్లలు లేని లోటును తీర్చేందుకు తమ ఇంటికి వచ్చిన సంతాన లక్ష్మిగా భావించామని పెంచిన తండ్రి ఆవేదన వ్యక్తంచేశాడు. బిడ్డ కోసం విలువైన ఆట బొమ్మలు దుస్తులు కొన్నాను. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు పాపతోనే గడిపాను. అనుక్షణం కళ్లలోపెట్టి చూసుకున్నాను' అని రోధిస్తూ పెంపు డు తల్లి పలుమార్లు ఆ చిన్నారిని ముద్దాడు తూ, ఒళ్లంతా తడుముతూ బోరున విలపించింది. పాప ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ కన్న తల్లికి అప్పగించింది.

సమాచారం

'నాణ్యమైన ధాన్యాన్ని తేవాలి'

మాడ్గులపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని గ్యారకుంటపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీసీలు నాగయ్య, స్వాగత్‌రావు, నాగమణి, పుల్లమ్మ, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే చర్యలు : ఆర్డీవో

మునుగోడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మునుగోడులోని శ్రీ సలాసర్ బాలాజీ, కార్తికేయ పత్తి జిన్నింగ్ మిల్లులలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో బుధవారం సందర్శించారు. మిల్లుల్లో నిల్వ ఉన్న పత్తిని పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల నుద్దేశించి మాట్లాడారు. పత్తిని తేమ లేకుండా ఇంట్లోనే ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ నరేందర్, ఏఓ పద్మజా, చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కత్తుల రవీందర్, సీసీఐ బయ్యార్ భల్బంద్ర నింజా, సూపర్ వైజర్ రాజేందర్, పాల్గొన్నారు.

భూమి పూజ

నాగార్జునసాగర్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఫైలాన్ కాలనీలో పూమూరి అభిరామేశ్వర్‌రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు బిగ్ హెల్ప్ ఎడ్యూకేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్మించే స్టేజీ నిర్మాణానికి బుధ వారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీదేవి,పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేసుకోవాలి

దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 2025 మార్చిలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులందరూ ఓటును నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ పిలుపునిచ్చారు. దేవరకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం దేవరకొండ మండలాధ్యక్షుడు కొర్ర లోక్యానాయక్, కార్యదర్శి దామోదర్, శ్రీనివాసులు, హెచ్ఎం శ్రీనివాసులు, పాల్గొన్నారు.

'దేవరకొండ ఆర్టీసీ సిబ్బంది సేవలు అభినందనీయం'

దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్టీసీ డిపో ఉద్యోగులు రాఖీ పౌర్ణమి, దసరా పండగ సందర్భంగా సమర్థవంతంగా విధులు నిర్వహించి డిపో రాష్ట్రస్థాయిలో ఆదాయంలో మొదటిస్థానం రావడానికి కృషి చేయడం అభినందనీయమని ఆర్టీసీ నల్లగొండ డిప్యూటీ ఆర్ఎం(ఆపరేషన్) మాధవి అన్నారు. బుధవారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు డ్రైవర్లు, సిబ్బందికి ఎండీ.సజ్జనార్ ఆదేశాలమేరకు నగదు ప్రోత్సాహకాలు అందజేసి మాట్లాడారు. దీపావళికి కూడ ఇదే స్ఫూర్తితో డిపోను ఆదాయంలో ముందంజలో ఉండేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డిపో మేనేజర్ రమేష్ బాబు, ఉద్యోగులు సునీత, వహీద్, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి నగదు అందిస్తున్న డిప్యూటీ ఆర్ఎం

ఆపదొస్తే అంతేసంగతి!

(5వ పేజీ తరువాయి)

ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. రాత్రి సమయంలో ఒక ఏఎన్ఎం, వాచ్‌మెన్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం రాత్రి ప్రాథమిక వైద్యశాలను విజిట్ చేసిన సమయంలో అంబులెన్స్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. రోడ్డు ప్రమాదాలలో తీవ్ర గాయాలైనప్పుడు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందక క్షతగాత్రులను దూర ప్రాంత ఆసుపత్రులకు మెరుగైన వైద్యం కోసం తీసుకుపోవలసి వస్తుంది. 24 గంటల వైద్యసేవలు నామమాత్రంగానే అందుతున్నాయి. ఆసుపత్రిలో సిబ్బంది కొరత, నీటిసరఫరా లేకపోవడం, వచ్చిన రోగులకు తాగునీటి సౌకర్యం అందుబాటులో లేవు. ఆసుపత్రిలో తరచు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.

● దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరిసర గ్రామాల ప్రజలు పదుల సంఖ్యలో వస్తుంటారు. ఏడాది కాలంగా ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉండడంతో చికిత్స కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా సిబ్బంది కొరత సైతం ఉంది.

● చింతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలి. ఇందులో ఇద్దరు వైద్యులు, ఒక్కఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నిషన్ మాత్రమే ఉన్నారు. స్టాఫ్‌నర్సు 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐదు సబ్ కేంద్రాల్లో పది మంది ఏఎన్ఎంలు అవసరముండగా కేవలం 6 గురు మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి ఆరోగ్య కేంద్రానికి నిత్య 100 నుంచి 150 మంది ప్రజలు ఆరోగ్య పరీక్షల కోసం వస్తుంటారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● తిప్పర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులంతా ప్రైవేటు ఆసుపత్రులకు, జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రికి వెళుతున్నారు.

● పెద్దఅడిశర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు ఉండగా ఒకరు డిప్యూటేషన్‌పై నాగార్జునసాగర్‌కు వెళ్లారు. ముగ్గురు స్టాఫ్‌నర్సులకు ఒక్కరే స్టాఫ్‌నర్స్ ఉన్నారు. దీంతో పగటిపూట మాత్రమే విధుల్లో ఉంటున్నారు. సాయంత్రం ఐదు తర్వాత వైద్యుడు కొండమల్లేపల్లి వెళతారు. అత్యవసర పరిస్థితిలో వచ్చిన రోగులు ప్రథమచికిత్సకు దగ్గర్లో ఉన్న ఆర్ఎంపీలను సంప్రదించాల్సి వస్తుంది. సిబ్బంది కొరతతో సమయపాలన పాటించకుండా మొక్కుబడిగా సేవలు అందిస్తున్నారు.

● కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులైన మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం లేదు. ఇద్దరు వైద్యాధికారులు కాగా, ఒక్కరే ఉన్నారు. ముగ్గురు స్టాఫ్‌నర్స్‌లకు ఒక్కరే ఉన్నారు. రోగులకు ఎక్కువగా అవసరమైన పారసిటమాల్, డైక్లోఫ్లెనాక్స్ వంటి ఇంజక్షన్లు కూడా అందుబాటులో లేవు. మందుల కోసం ఇండెంట్ పెట్టినప్పటికీ అరకొరగా అందుతున్నాయని సిబ్బంది చెప్పారు.

● కేతేపల్లి ఆసుపత్రిలో నిత్యం పగటి పూట వందకు పైగా ఓపీ ఉంటుంది. 65వ నెంబర్ జాతీయ రహదారిపై నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. క్షతగాత్రులకు సత్వరం వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో హైవే వెంట గల మండల కేంద్రం కేతేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం 24గంటల ఆసుపత్రుల జాబితాలో చేర్చింది. ఇందుకోసం ఆసుపత్రికి రెండు వైద్యాధికారుల పోస్టులు కేటాయించినా ఆ మేరకు నియమకాలు లేకపోవడంతో గత రెండేళ్లుగా ఒక్క వైద్యాధికారి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. హైవే వెంట ఉన్నప్పటికీ ఈ ఆసుపత్రికి ఏనాడూ 108సర్వీసు సౌకర్యం లేదు. దీంతో హైవేపై ఏదైనా ప్రమాదం జరిగినా, మండలంలోని ఏ గ్రామంలో ఎలాంటి వైద్యపరమైన అవసరం వచ్చినా 10కి.మీ. దూరంలోని నకిరేకల్ పట్టణం నుంచిగాని 20కి.మీ. దూరంలో సూర్యాపేట పట్టణం నుంచిగాని 108వాహనం రావాల్సి ఉంటుంది. 108సర్వీసు కొరకు అనేక మంది విజ్ఞప్తి చేస్తున్నా అందుబాటులోకి రావడం లేదు.



కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా అన్నిరంగాల్లో రాణించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పలు సంక్షేమ పథకాలు అందుబాటులోకి తెచ్చిందని స్వశక్తితో ఎదిగేందుకు పథకాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితాశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్ గాజుల సుకన్యా శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారెడ్డి, మెప్మా ఇన్‌చార్జి సీహెచ్ పద్మ పాల్గొన్నారు.



ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

సమస్యలను ఉపాధ్యాయులతో పంచుకోండి : అదనపు కలెక్టర్

డిండి, అక్టోబరు 23(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు తమ సమస్యలను ఉపాధ్యాయులతో పంచుకోవాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికల), జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. గురుకుల పాఠశాలలో బాలికలతో ఆయన మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు వస్తే నిర్భయంగా ఉపాధ్యాయులకు తెలుపాలని సూచించారు. ఉపాధ్యాయులు స్పందించని యెడల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని అన్నారు. జూలైలో ఎలుకలు కరిచిన విద్యార్థులతో ఆయన మాట్లాడారు. కొందరు విద్యార్థులు తమకు చర్మ వ్యాధులు సోకినట్లు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకొని బోధించాలని కోరారు. గురుకుల పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచేందుకు, డ్రైనేజీల కోసం ప్రతిపాదనలు పంపించాలని పీఆర్ఏఈని కోరారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఏజెన్సీని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి ఉండడం, పందులు తిరుగుతుండడాన్ని చూసి ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకన్న, ప్రిన్సిపల్ శిరీష, పంచాయతీ కార్యదర్శి జంగయ్య, పీఆర్ఏఈ విజయ్‌కుమార్, బొల్లె శైలేజ్, గడ్డమీది సాయి ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

పోలీసుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి

● మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పెషల్ పోలీసుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చాలని మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండు రంగారావు అన్నారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ పోలీసు సమస్యలపై వాళ్లు పోరాడే హక్కు లేనందున వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేయడం వెనుక శాఖ పరంగా వారిపై కొనసాగుతున్న ఒత్తిడిని అర్థంచేసుకోవాలని అన్నారు. పోలీస్ శాఖపై రాజకీయ నాయకులు విపరీత ఒత్తిడితో అనేక సందర్భాల్లో ప్రజా కంటకులుగా కనబడే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు కింది స్థాయి పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి నివేదించి వాటిని సానుకూలంగా పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయాలని కోరారు. ఆందోళన చేస్తున్న పోలీసు కుటుంబాలను వేధించవద్దని కోరారు.



పిడుగుపడి ఆవులు మృతి

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగట్టు గ్రామంలో బానావత్ చందు ఆవు, ఎద్దును మంగళవారం రాత్రి తన పొలంలోనే కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. అర్ధరాత్రి ఉరుములతో కూడిన పిడుగుపడడంతో ఆవు, ఎద్దు మృత్యువాత పడ్డాయి. ఉదయం పూట పొలం వద్దకు వెళ్లిన రైతుకు చనిపోయిన ఆవులను చూసి కన్నీటిపర్యంతమయ్యాడు. వీటి విలువ లక్ష రూపాయలు ఉంటుందని రైతు తెలిపాడు. తహసీల్దార్ గురువారం వచ్చి పంచనామా చేస్తామని చెప్పినట్లు రైతు తెలిపారు.

మూసీ సుందరీకరణను ఓర్వలేకనే దుష్ప్రచారం



దేవరకొండలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మూసీనది సుందరీకరణ చేపడుతుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు అడుపడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. దేవరకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ నది తీరానఉన్న ప్రజలు దుర్వాసన, రోగాలతో ఇబ్బందులుపడుతుడడంతో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని సుందరీకరణకు శ్రీకారం చేపడితే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి శ్రీశైలం సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిస్తూ 8 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీకి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4,643 కోట్లు కేటాయించి రెండేండ్లలో పూర్తి చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

దేవరకొండ పట్టణంలో ముత్యాలమ్మ కాలనీలో ఫారెస్ట్ కార్యాలయం నుంచి పర్వతరావు చెరువు వరకు రూ.7 కోట్లు ఎస్డీ సబ్ ప్లాన్ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలూనాయక్ బుధవారం శంకుస్థాపన చేశారు.

అనంతరం ముత్యాలమ్మ బజార్‌లో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం త్రిలింగ లింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, కౌన్సిలర్ భూదేవి సైదులు, పగిడిమర్రి రఘురాములు, మాధవరెడ్డి, జాన్‌యాదవ్,సిరాజ్‌ఖాన్, సురేష్ గౌడ్, వెంకటేష్, రుక్మారెడ్డి, రాంసింగ్ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతం చేయాలి : నారా భువనేశ్వరి



భువనేశ్వరిని కలిసిన జిల్లా టీడీపీ నాయకులు

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి జిల్లాలో ఆ పార్టీ నాయకులకు సూచించారు. జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు బుధవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి దీపావళి శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి శేఖర్ రెడ్డి, బంటు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి : సబ్ కలెక్టర్

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నెల్లికల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణకు రైతులు సహకరించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ కోరారు. మండలంలో నిర్మాణంలో ఉన్న నెల్లికల్ ఎత్తిపోత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంప్‌హౌస్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతి గురించి సంబంధిత ఇంజినీర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నెల్లికల్ గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లికల్ లిఫ్టు పనుల్లో భాగంగా ప్రెషర్ మెయిన్, కాల్వల నిర్మాణానికి సుమారుగా 21 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సంబంధిత రైతులు తమ భూముల గుండా వెళ్లే పైపులైన్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం రైతుల నుంచి సేకరించి భూమికి పరిహారం అంద జేస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యల గురించి సబ్ కలెక్టర్‌కు తెలియజేయగా పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి రైతు భూసమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులైన వారికి పట్టాదారు పుస్తకాలను త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ అనిల్, ఎస్ ఎస్సీ ఈఈ కరుణాకర్, డీఈ సీతారాం నాయక్, ఏఈలు వేణుగోపాల్, రవి, ప్రవీణ్, సర్వేయర్ నాగసాయి, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి : ఏఎస్పీ

నల్లగొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ రాములు నాయక్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా పోలీస్ సిబ్బంది నిర్వహించే విధులు, విధి నిర్వాహణలో ఉపయోగించే ఆయుధాలు, బాంబ్ డిటెక్టర్ పరికరాలు, పోలీస్ డాగ్స్ వాటి పనితీరును, ఫింగర్ ప్రింట్, క్లూస్‌టీం, షీటీం, భరోసా, కమాండ్ కంట్రోల్ రూం, సీసీ కెమెరాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ రమేష్, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐలు సంతోష్, శ్రీను, ఆర్ఎస్ఐలు కళ్యాణ్‌రాజ్, రాజీవ్, సాయిరాం, నాగరాజు, శ్రావణి, మమత పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎస్.కృష్ణయ్య ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, ఇన్‌స్టా గ్రామ్, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటమ్మ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): సాగర్ హిల్‌కాలనీ పోలీస్ స్టేషన్లట ఓపెన్ హౌస్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ భీసన్న, ఎస్ఐ సంపత్ సిబ్బంది జావేద్, శంకర్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

కొండమల్లేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి లో బుధవారం ఆటోలో ఓ వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందాడు. గుర్రంపోడు మండలం జూనూతల గ్రామపంచాయతీ గానీరాంతండాకు చెందిన మెగావత్ జాను(70) బుధవారం మధ్యాహ్నం పెద్దవూర మండలంలో తమ బంధువుల ఇంటికి వెళ్లడానికి ఆటో ఎక్కాడు. ఆ ఆటోలో కొద్ది దూరం ప్రయాణం చేసిన జానునాయక్ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు.

సంక్షిప్త సమాచారం...

● శాలిగౌరారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మనిమద్దె జడ్పీ స్కూల్ గ్రంథాలయానికి గ్రామానికి చెందిన కోల్లోజు లలితాచంద్రశేఖర్ దంపతులు రూ.10వేల విలువ గల పుస్తకాలను వారి బంధువు అంగన్‌వాడీ టీచర్ శంకరమ్మ ద్వారా అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు తెలిపారు.

● కొండమల్లేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న 54 మంది విద్యార్థులకు బుధవారం జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి మెటీరియల్‌ను అందజేసి మాట్లాడారు.కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఉపాధ్యాయలువిద్యార్థులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి మల్లు గౌతమ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక సిఐటీయు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో వున్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. నాయకులు చట్లా చంద్రారెడ్డి, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పల్లా భిక్షం, కృష్ణయ్య, యేసు పాల్గొన్నారు.

● చింతపల్లి, నకిరేకల్ అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ చింతపల్లి మండలాధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో నమోస్టాల్‌లో పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు.నకిరేకల్ మండలంలోని మర్రూరు, గోరెంకలపల్లి, మోదినిగూడెం, నర్సింహాపురం గ్రామాల్లో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీజిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, వెన్నం శేఖర్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, కనిగిరి గోవర్ధన్, కుందేళ్ల శ్రీశైలం యాదవ్, గజ్జ అభినవ్ బండమీది శ్రీకాంత్, నగేష్ పాల్గొన్నారు.

● గట్టుప్పల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయొద్దని గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామానికి 377, 378 సర్వే నంబర్ చెందిన చింతలగడ్డ లబ్ధిదారుల బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు అధికారులు హద్దులు చూపించక పోవడంతో ఓ పక్క రైతుల ఆక్రమించుకున్న అధికారులు పట్టించుకోకపోదంతో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ కేటాయించిన స్థలంలో హద్దులు చూపించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఎమ్మార్వో ఆఫీస్‌లో ఆర్ఐ సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

● దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):గిరిజనులు గ్రామీణ ప్రాంతాల్లో కుట్లు, అల్లికలతో తయారుచేసిన దుస్తులు, వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి ఆదుకుంటామని నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్ అన్నారు. దేవరకొండ మండలం మర్రిచెట్టు తండాలో బుధవారం గిరిజనులు చేతికుట్లు, అల్లికలతో తయారు చేసిన వస్తువులు, దుస్తులకు నాబార్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ అమీర్‌పేటలో ఈనెల 15 నుంచి 22 వరకు నిర్వహించిన ఎగ్జిబిషన్ ప్రదర్శన నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను బుధవారం సీజీఎం ఉదయ్‌భాస్కర్ సందర్శించి మర్రిచెట్టుతండా గిరిజనులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నాబార్డు జనరల్ మేనేజర్ గణపతి, శ్వేత, మర్రిచెట్టుతండా మాజీ సర్పంచ్ నేనావత్ శీనునాయక్, మహిళలు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న నాబార్డు సీజీఎం ఉదయ్

● దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పత్తి తుకాల్లో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికల కొలతలశాఖ జిల్లా అధికారి రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం నాంపల్లి, చండూర్, మునుగోడు, మండలాల్లో దాడులు నిర్వహించి ప్రైవేట్ పత్తి కొనుగోలు దారులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

● కనగల్, అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి) కనగల్ గ్రామానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు శంకర్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. దాంతో అదే గ్రామానికి చెందిన అతని స్నేహితుడు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సింగం వెంకన్న రూ.50 వేలు పంపించగా బుధవారం శంకర్ భార్యకు అందించారు.

యువకుడి ఆత్మహత్య కేసులో నిందితుడికి రిమాండ్

మునుగోడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలకేంద్రానికి చెందిన యాసరాణి శివ(24)లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఘటనలో పోలీసులు ఓ యువకుడిని రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో చండూరు సీఐ వెంకటయ్య ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లుతో వెల్లడించారు. మండలకేంద్రానికి చెందిన రవి తేజ ఇండియన్ స్టూడెంట్ ఆర్గనైజేషన్(ఐఎస్ఓ) అనే విద్యార్థి సంఘం ముసుగులో అక్రమ సంపాదనకు అలవాటు పడి కొద్ది కాలంగా పలువురిని దౌర్జన్యంతో బెదిరిస్తూ అక్రమంగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో రవితేజ కుటుంబం నిర్మించుకున్న ఇంటి విషయంలో శివను వేధింపులకు గురిచేసి రూ. 2లక్షల వరకు వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో తీవ్ర ఆందోళన శివ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అప్పటికే పరారీలో ఉన్న నిందితుడిని అదుపులో తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద బైక్, రెండు సెల్ ఫోన్లు, రూ. 2వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.